# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **లండన్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ లో చెరువుల అభివృద్ధి ద్వారా పల్లె ప్రగతిని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **తెలంగాణలో రైతుల కోసం కొత్త విత్తన చట్టం-2025 ముసాయిదాను రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు.**

4. **భారత అంతరిక్ష పరిశోధన సంస్థ -ఇస్రో నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైందని ఆ సంస్థ చైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు.**

5. **మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్ విజయం సాధించింది.**

==========================

లండన్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి వివిధ పరిశ్రమలు, సంస్థలకు చెందిన ప్రతినిధులను కలవనున్నారు. వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు ముగిసిన తర్వాత వివిధ పారిశ్రామిక వేత్తలతో సీఐఐ నేతృత్వంలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అలాగే లండన్‌లోని ఇండియన్ హైకమిషనర్ దొరైస్వామితో చంద్రబాబునాయుడు సమావేశం కానున్నా రు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఆయా రంగాల్లో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు అంశాన్ని దొరైస్వామితో జరపనున్న సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించనున్నారు.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి నిన్న సమావేశాన్ని నిర్వహించారు.

శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులకు డివిజన్ల బాధ్యతలతో పాటు, పోలింగ్ కేంద్రాలవారీగా

పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రేపటి నుంచి ముఖ్యమంత్రి మరోమారు ప్రచారం చేయనున్నారని పార్టీ వర్గాలు వివరించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో చెరువుల అభివృద్ధి ద్వారా పల్లె ప్రగతిని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లాలోని వెంగళాయపాలెంలో అభివృద్ధి చేస్తున్న చెరువును ఆయన నిన్న పరిశీలించారు. పర్యాటకంగా ఉపయోగపడేలా చెరువుల పరిసర ప్రాంతాలలో మౌలిక వసతులతో పాటు, వినోదం, క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..35 సెకెన్లు

---------------------------

శ్రీకాకుళం తొక్కిసలాట ఘటన బాధితులను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌తో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. తొక్కిసలాట జరిగిన ప్రాంతానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ,

వాయిస్ ..20 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి కోలుకున్న వారిని ఇళ్లకు పంపామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యంపై ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్షించారు. పలాస సామాజిక ఆసుపత్రిలో ప్రస్తుతం 11 మంది చికిత్స పొందుతున్నారని, వీరికి చికిత్స అందించే విషయంలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం సత్యవతిపేటలో జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. గత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ -ఇస్రో నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైందని ఆ సంస్థ చైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి గత సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక రాకెట్ ను ప్రయోగించారు.

ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ నారాయణన్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ఉపగ్రహం బరువు 4 వేల 410 కిలోలని భారత్ ప్రయోగించిన ఉపగ్రహాలన్నింటిలోనూ ఇదే అత్యంత బరువైనదని తెలిపారు.

సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడడంతోపాటు సముద్ర వాతావరణ పరిస్థితులు తెలుసుకొనే వీలు కలుగుతుందని  నారాయణన్ తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---

కార్తీక సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలు, శ్రీశైలం, తెలంగాణాలోని వేములవాడ, రామప్ప, కీసర గుట్ట వంటి శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామునుంచే కృష్ణా, గోదావరి స్నాన ఘట్టాల్లో కార్తీకమాస స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

---

తెలంగాణలో రైతులకు అన్నివిధాలుగా ఉపయోగపడేలా కొత్త విత్తన చట్టం-2025 ముసాయిదాను రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో కొత్త విత్తన చట్టం ముసాయిదా రూపకల్పన కమిటీతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాణ్యమైన విత్తనోత్పత్తికి కంపెనీలను ప్రోత్సహించేలా, మోసం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించేలా ముసాయిదా రూపొందించాలన్నారు. పంట నష్టపోయే రైతులకు సంపూర్ణ పరిహారం అందేలా ముసాయిదా ఉండాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

---

ఐసీసీ మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్ విజయం సాధించింది. ముంబై వేదికగా జరిగిన  ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 298 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను భారత్ గెల్చుకుంది.

ఫైనల్ మ్యాచ్ లో భారత్ విజయం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు.

---

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలిపారు.

తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు  వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================